ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 16.02.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలోని మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు.. మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు, డిప్యూటీ మేయర్ల ఎన్నికలు ఈరోజు జరుగుతున్నాయి.

2. దక్షిణాసియాలోనే మొట్టమొదటి ఇండియా-AI ఇంపాక్ట్ సదస్సు – న్యూఢిల్లీలోని భారత మండపంలో ఈరోజు ప్రారంభమైంది.

3. రేపటినుంచి రెండు రోజుల పాటు హైదరాబాద్ లో బయో ఆసియా-2026 సదస్సు జరుగుతుంది. 50 దేశాల నుంచి సుమారు 4 వేల మంది ప్రతినిధులు, 500 కి పైగా కంపెనీలు ఈ సదస్సులో పాల్గొంటున్నాయి.

4. అమెరికాతో ఒప్పందంపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రైతులు, ఎగుమతిదారుల్లో అనవసర భయాందోళనలు కలిగించేలా ఉన్నాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.

------------------------------

**ఎన్నికలు**

రాష్ట్రంలోని మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు, డిప్యూటీ మేయర్ల ఎన్నికలు ఈరోజు జరుగుతున్నాయి. ఇటీవల 116 మున్సిపాలిటీలలో గెలిచిన కౌన్సిలర్లు, 7 కార్పొరేషన్లలో గెలుపొందిన కార్పొరేటర్లు ఇవాళ ప్రమాణ స్వీకారం చేస్తున్నారు. ఆయా కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఉదయం 11 గంటల నుంచి కార్పొరేటర్లు,

కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మేయర్లు, ఛైర్మన్ల ఎన్నిక కార్యక్రమాన్ని రాష్ట్ర ఎన్నికల అధికారులు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలిస్తున్నారు.

**డెస్క్**

-------------------------

**ప్రమాణాలు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపల్ ఛైర్మన్ గా కాంగ్రెస్ పార్టీకి చెందిన జూపల్లి శశికళ, వైస్ ఛైర్మన్ గా జూపల్లి రమేష్ బాబు ప్రమాణ స్వీకారం చేశారు. కొత్తగూడెం నగరపాలక సంస్థ కార్యాలయంలో సిపిఐ, కాంగ్రెస్ కార్పొరేటర్లు ప్రమాణ స్వీకారం చేశారు. కొత్తగూడెం తొలి మేయర్ గా సీపీఐ పార్టీకి చెందిన మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ గా కాంగ్రెస్ పార్టీకి చెందిన నూకల సరిత ప్రమాణ స్వీకారం చేశారు.

సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో 16 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు, ఒక బీజేపీ కౌన్సిలర్, ఒక స్వతంత్ర కౌన్సిలర్ ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు. 8 మంది BRS కౌన్సిలర్లు హాజరు కాలేదు.

వరంగల్ జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట.. హన్మకొండ జిల్లాలోని పరకాల మున్సిపాలిటీల పాలకవర్గాల ప్రమాణ స్వీకారం ఈరోజు నిర్వహించారు. పరకాలలో 22 వార్డులకు 13 వార్డులను గెలుచుకొని కాంగ్రెస్ స్పష్టమైన మెజారిటీతో ఉంది. నర్సంపేటలో అధికార పార్టీ 21 వార్డులు గెలుచుకొని స్పష్టమైన మెజారిటీ సాధించింది. వర్ధన్నపేట మున్సిపాలిటీలో మొత్తం 12 వార్డులకు ఆరు బి ఆర్ ఎస్, ఐదు కాంగ్రెస్, ఒక స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. ఇక్కడ ఎక్స్ అఫీషియో సభ్యుడు ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు ఓటు ఛైర్మన్ పీఠాన్ని నిర్ణయించనుంది.

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ, సిరిసిల్ల మున్సిపాలిటీలలో కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం కొద్దిసేపటిక్రితం ముగిసింది.

**భద్రాద్రి, సంగారెడ్డి, వరంగల్, సిరిసిల్ల**

-----------------------

**ఇండియా-AI ఇంపాక్ట్ సదస్సు**

ఇండియా-AI ఇంపాక్ట్ సదస్సు 2026 - న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతోంది. ఐదు రోజుల పాటు జరిగే ఈ సదస్సు గ్లోబల్ సౌత్‌లో నిర్వహిస్తున్న మొట్టమొదటి అంతర్జాతీయ AI సదస్సు. 20 దేశాల నుండి ప్రపంచ స్థాయి నాయకులు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు. ఇందులో ఆస్ట్రేలియా, జపాన్, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్, సెర్బియా, ఎస్టోనియా, తజికిస్తాన్, ఆఫ్రికాతో సహా 13 దేశాల పెవిలియన్‌లు ఉంటాయి. రెండు లక్షలకు పైగా ప్రజలు ఈ సదస్సులో పాల్గొనేందుకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు.

ఇరవై దేశాల నుండి ప్రపంచ నాయకులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు.దక్షిణ ఆసియాలో మొట్టమొదటి AI సమ్మిట్‌ను నిర్వహించడానికి భారతదేశం సరైన ప్రదేశం అని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ అన్నారు. ఈ సదస్సుకు వస్తున్న ప్రపంచస్థాయి నాయకులకు స్వాగతం చెబుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ట్వీట్ చేశారు. అందరికీ సంక్షేమం, అందరికీ సంతోషమే ధ్యేయంగా సర్వజన హితం, సర్వజన సుఖం ఇతివృత్తంతో ఈ సమ్మిట్ నిర్వహిస్తున్నామని సోషల్ మీడియా పోస్ట్ లో ప్రధానమంత్రి పేర్కొన్నారు.

మరోవైపు.. AI ఇంపాక్ట్ సమ్మిట్ కోసం ముందస్తు ట్రాఫిక్ హెచ్చరికలు జారీచేశారు. భారత్ మండపం, సుష్మా స్వరాజ్ భవన్‌లో జరిగే సమ్మిట్‌కు హాజరయ్యే ప్రతినిధులు పరిమిత పార్కింగ్, సవరించిన గేట్ యాక్సెస్ కారణంగా ప్రజా రవాణాను ఉపయోగించాలని అధికారులు సూచించారు. మరోవైపు..  ఢిల్లీ ట్రాఫిక్ పోలీసులు కూడా భారత్ మండపం సమీపంలోని పలు రోడ్లపై ఆంక్షలు విధించారు.

**ఎస్ఎస్డీ**

------------------------------

**బయోఆసియా**

ఆసియాలో అగ్రగామి లైఫ్ సైన్సెస్, హెల్త్-టెక్ ఫోరమ్ – బయో ఆసియా 2026 సదస్సు రేపు హైదరాబాద్‌లో ప్రారంభమవుతుంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 50 దేశాల నుంచి 4 వేల మందికి పైగా ప్రతినిధులు, 500 కి పైగా కంపెనీలు ఈ సదస్సులో పాల్గొంటున్నాయి. హైదరాబాద్ లోని హైటెక్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ లో రెండు రోజుల పాటు జరిగే ఈ అంతర్జాతీయ సదస్సును తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారు. గ్లోబల్ లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో నూతన ఆవిష్కరణలు, ఆలోచనలకు రాష్ట్రాన్ని వేదిక చేసేందుకు హైదరాబాద్ లో ప్రతి ఏడాది బయో ఏషియా సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సదస్సులో ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ, మెడ్‌టెక్, డిజిటల్ హెల్త్, అత్యాధునిక ఉత్పాదక రంగాలలోని 175 పైగా ఎగ్జిబిటర్లతో ప్రదర్శన కూడా నిర్వహిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన సంస్థల అధిపతులు, సీఈఓలు, ప్రతినిధులు సంబంధిత రంగాల్లో నిపుణులు, ఆవిష్కర్తలు ఈ వేదికపై జరిగే చర్చలు, సమావేశాల్లో పాల్గొంటారు. లైఫ్ సైన్సెస్ రంగంలో వస్తున్న సరికొత్త మార్పులు, శాస్త్ర పురోగతి, ఏఐ ప్రభావం గురించి ఈ సదస్సులో చర్చిస్తారు. "టెక్ బయో అన్‌లీష్డ్: AI, ఆటోమేషన్, ది బయాలజీ రివల్యూషన్" అనే ఇతివృత్తంతో 2026 ఎడిషన్ సాగుతోంది.

**NSD అండ్ డెస్క్**

---------------------------------

**కిషన్ రెడ్డి ట్వీట్**

అమెరికాతో ఒప్పందంపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రైతులు, ఎగుమతిదారుల్లో అనవసర భయాందోళనలు కలిగించేలా ఉన్నాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు అంగీకరించబోరని తెలిపారు. ప్రస్తుతం భారత్ 4 లక్షల కోట్ల రూపాయల విలువైన వస్త్రాలను ఎగుమతి చేస్తోందని, 38 దేశాల పరిధిలో 9 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ద్వారా 45 లక్షల కోట్ల రూపాయల విలువైన టెక్స్‌టైల్ మార్కెట్‌కు ఇప్పుడు అవకాశాలు ఏర్పడ్డాయని కేంద్రమంత్రి వివరించారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అభివృద్ధి చేస్తున్న 7 మెగా జౌళి పార్కుల్లో.. వరంగల్ కాకతీయ

టెక్స్‌టైల్ పార్కు కూడా ఉందని, దీని వల్ల తెలంగాణకు భారీ లబ్ధి చేకూరనుందని.. అది రాహుల్‌కు ఇష్టం లేదా? అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు.

డెస్క్

---------------------------

**రేవంత్ రాహుల్ ట్వీట్**

రాహుల్ గాంధీ దేశం తరఫున, రైతుల తరఫున నిలబడి ఉన్నారని, అమెరికాతో రాజీ పడుతూ కేంద్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని ప్రశ్నించే ఒకే ఒక్క నేత రాహుల్ గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు చేశారు. అన్ని రాజకీయ విభేదాలను పక్కనపెట్టి మొత్తం భారత రాజకీయ వ్యవస్థ మన రైతులను రక్షించడానికి ఐక్యంగా ఉందని, రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

డెస్క్

---------------------------

**నుమాయిష్**

హైదరాబాద్ నాంపల్లిలో 46 రోజుల పాటు అలరించిన 85వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్-2026) ప్రశాంతంగా ముగిసింది. జనవరి 1న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారంభించిన ఈ ప్రదర్శనను, ఈ ఏడాది రికార్డు స్థాయిలో 23 లక్షల 25 వేల మంది సందర్శించినట్లు ఎగ్జిబిషన్ సొసైటీ వెల్లడించింది. ఫిబ్రవరి 14న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ముగింపు వేడుకలను నిర్వహించారు.

**పీటీసీ – హైదరాబాద్**

-----------------------------------

**డీజీపీ**

తెలంగాణకు చెందిన.. ఇప్పటికీ అజ్ఞాతంలో క్రియాశీలకంగా ఉన్న 15 మంది మావోయిస్టులు వెంటనే లొంగిపోయి శాంతియుత జీవనం గడపాలని రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ శివధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. లొంగిపోయిన మావోయిస్టులకు తెలంగాణ ప్రభుత్వం పునరావాస పథకాలు

అమలు చేస్తోందని, గత రెండేళ్లలో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన 588 మంది వివిధస్థాయి మావోయిస్టులు లొంగిపోయి ప్రస్తుతం కుటుంబాలతో సంతోషంగా జీవిస్తున్నారని డీజీపీ వివరించారు.

**డెస్క్**

--------------------------

**బందోబస్తు**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వర్ధన్నపేట, పరకాల, నర్సంపేట, స్టేషన్ ఘన్ పూర్, జనగామ పురపాలక సంస్థల్లో చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో బిఎన్ఎస్ సెక్షన్ 163 అమలులో ఉంటుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు పురపాలక సంస్థలకు 200 మీటర్ల దూరంలో ఉండాలని సూచించారు.

**పీటీసీ – వరంగల్**

----------------------------------

**ప్రమాణస్వీకారం**

వనపర్తి మున్సిపాలిటీలో నూతన కౌన్సిలర్ ల ప్రమాణస్వీకారం పూర్తయింది. జిల్లా ఉప ఎన్నికల అధికారి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో తహశీల్దార్ రమేష్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు సమక్షంలో నూతనంగా ఎన్నికైన 33 మంది కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేశారు.

**పీటీసీ – వనపర్తి**

-----------------------------

**కేదార్ నాథ్**

చార్ ధామ్ యాత్రల్లో ముఖ్యమైన నాలుగు ఆలయాల ద్వారాలు ఏప్రిల్ నెలలో తెరచుకోనున్నాయి. ఏప్రిల్ 22న కేదార్ నాథ్, 23న బద్రీనాథ్ ఆలయాల ద్వారాలు తెరుచుకుంటాయి. అలాగే గంగోత్రి యమునోత్రి ఆలయాలు ఏప్రిల్ 19 నుండి

తెరుచుకుంటాయని ఆలయ కమిటీల ప్రతినిధులు తెలిపారు. మహా శివరాత్రి సందర్భంగా కేదార్ నాథ్.. బద్రీనాథ్ క్షేత్రాలకు సంబంధించిన కమిటీలు ఆలయాలను తెరిచే తేదీలను ప్రకటించారు.

**జీఎస్**

---------------------------

**మహా శివరాత్రి**

మహా శివరాత్రి సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన, భీమేశ్వర స్వామి ఆలయంలో మహాలింగార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయం శంకరమఠంలో అనువంశిక కుటుంబాలకు చెందిన అర్చకుల వేద మంత్రాలతో ఈ క్రతువు నిర్వహించారు.

**పీటీసీ – సిరిసిల్ల**

---------------------------

**యాదాద్రి**

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఎల్లుండి నుంచి 28 వరకు 11 రోజుల పాటు నిర్వహించనున్నారు. ఎల్లుండి స్వస్తివాచనంతో ప్రారంభమై, స్వామి, అమ్మవార్ల కల్యాణం, రథోత్సవం వంటి ప్రత్యేక పూజలతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి.

**డెస్క్**

----------------------------

**విభావరి**

మహాశివరాత్రి సందర్భంగా నిన్న రాత్రి సంగారెడ్డిలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంగీత విభావరి స్థానికులను ఆకట్టుకుంది. ప్రముఖ గాయకులు వందేమాతరం శ్రీనివాస్, నాగూర్ బాబు, మాళవిక తదితరులు శివరాత్రి భక్తి గీతాలు వినిపించారు.

**పీటీసీ – సంగారెడ్డి**

----------------------------------

**డ్రంక్ అండ్ డ్రైవ్**

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో 196 మందిపై కేసులు నమోదు చేశామని సైబరాబాద్ ట్రాఫిక్ డిసిపి రంజన్ రతన్ కుమార్ తెలిపారు. వీరిలో 140 మంది ద్విచక్ర వాహనదారులు, 13 మంది ఆటోడ్రైవర్లు, 41 కార్లు, ఇద్దరు హెవీ వాహనాల డ్రైవర్లు ఉన్నారని వెల్లడించారు.

**డెస్క్**

------------------------------